క్లుప్తంగా

ప్రతిదానిపై అవగాహన అవసరం



చెరువు సందర్శనలో విద్యార్థులు

జగిత్యాల: ప్రస్తుత హైటెక్ యుగంలో ప్రతిదానిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక మహిళా కళాశాల విద్యార్థులు ముప్పాల చెరువును సందర్శించారు. జలావాసాల్లో పెరుగుతున్న వృక్షజంతు ప్లవకాలు, మొక్కలను, జంతువులను పరిశీలించారు. జంతుశాస్త్ర విభాగాధిపతి చంద్రయ్య, కిరణ్మయి, సుల్తానా, సత్యప్రకాశ్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేటలో బుధవారం శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయ వార్షిక మహోత్సవంతో పాటు జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు, సర్పంచ్ వనతడుపుల నాగరాజు, ఎంపీటీసీ ఓస సత్తెమ్మ, ఉపసర్పంచ్ సామ రవి, వీడీసీ చైర్మన్ ఎర్రంశెట్టి రాజగంగారాం, నాయకులు ఓస రాజిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి చదివి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని సాధించాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి సూచించారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయంలో వార్షికోత్సవం నిర్వహించారు. అనంతరం విద్యార్థినులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎంపీపీ జాజాల భీమేశ్వరితో పాటు సర్పంచ్ నేమూరి లత, వర్షకొండ ఉపసర్పంచ్ మంగిలిపెల్లి లక్ష్మన్, పాఠశాల ప్రత్యేకాధికారి గీత, నాయకులు నేమూరి సత్యనారాయణ, జాజాల జగన్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే ఉత్తమ బోధన



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

సారంగాపూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే ఉత్తమ బోధన కొనసాగుతుందని విద్యార్థులు ఈ విషయాన్ని గుర్తించాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. ఈ మేరకు బుధవారం బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో స్పోర్ట్స్, కల్చరల్, ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొంక వేణు, ప్రిన్సిపాల్స్ సంఘం అధ్యక్షుడు రమేశ్‌బాబు, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న ఎంపీపీ భీమేశ్వరి

ఇబ్రహీంపట్నం: ఇంగ్లిష్ కథాకథనం స్టోరీ టెల్లింగ్ పోటీల్లో మండలంలోని గోధూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి రామగిరి చరణ్‌తేజ రాష్ట్రస్థాయికి పోటీలకు ఎంపికయ్యారు. గత నెల 31న జగిత్యాలలో నిర్వహించిన ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ కథాకథనం స్టోరీ టెల్లింగ్ పోటీల్లో మొదటి బహుమతిని సాధించడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాగా ఈ విద్యార్థిని బుధవారం గోధూర్ హైస్కూల్‌లో ఎంపీపీ జాజాల భీమేశ్వరి సన్మానించారు. విద్యార్థి 13న వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్‌ఎం నాగరాజు తెలిపారు. ఇంగ్లిష్ ఉపాధ్యాయులు శ్రీధర్‌కుమార్, నాయకులు జాజాల జగన్‌రావు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణ పనుల్లో జాప్యం

- అర్ధంతరంగా నిలిచిన పనులు
- సరిపోని నిధులు
- పెరిగిన నిర్మాణ వ్యయం..
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



కోరుట్ల-సంగెం మధ్య పెద్దవాగుపై నిర్మాణంలో ఉన్న వంతెన

కోరుట్లరూరల్: మండలంలోని పెద్దవాగుపై కోరుట్ల-సంగెం, సంగెం-యెఖీన్‌పూర్ గ్రామాల మధ్య నిర్మిస్తున్న చెక్‌డ్యాం, వంతెనల నిర్మాణ పనులు పిల్లర్ల దశ వరకే నిర్మించి అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో వాగులో సరైన దారులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

2016లో పనులు ప్రారంభం..

కోరుట్ల-సంగెం గ్రామాల మధ్య పెద్దవాగుపై చెక్‌డ్యాం, వంతెన నిర్మాణం కోసం రూ.5.90 కోట్లు మంజూరు కాగా సంగెం-యెఖీన్‌పూర్ గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగులో చెక్‌డ్యాం, వంతెన నిర్మాణం కోసం రూ.4.10 కోట్ల నిధులు 2016లో మంజూరయ్యాయి. అదే సంవత్సరంలో రెండు వంతెనల పనులు ప్రారంభించారు. ఏడేళ్లుగా పనులు నత్తనడకగా సాగి చెక్ డ్యామ్‌లు పూర్తి కాగా వంతెనల పనులు పిల్లర్ల వరకే పూర్తి చేసి పనులను అర్ధంతరంగా నిలిపివేశారు.

పెరిగిన నిర్మాణ వ్యయం..

పనులు ఏడేళ్లపాటు నత్తనడకగా సాగడంతో నిర్మాణ వ్యయం కూడా పెరిగింది. దీంతో కోరుట్ల-సంగెం వంతెన పనులు చేస్తున్న కాంట్రాక్టర్ ఈ పనులు పూర్తికాక ముందే చేతులెత్తేశారు. ఈ వంతెన కోసం రూ.5.90 కోట్లు మంజూరు కాగా రూ.3.50 కోట్ల వరకే పనులు చేసి వదిలేశారు. మరో రూ.2.40 కోట్ల పనులు మిగిలి ఉండగానే కాంట్రాక్టర్ తప్పుకున్నారు. కాగా ఈ వంతెన కోసం మరో రూ.70లక్షలు అదనపు నిధుల కోసం ఇంజనీరింగ్ అధికారులు నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. కాగా మొత్తం రూ.3.10కోట్ల వ్యయంతో కోరుట్ల-సంగెం గ్రామాల మధ్య వంతెన పనులు పూర్తి చేయాల్సి ఉండగా కొత్తగా టెండర్ వేయాల్సి ఉంది. ప్రభుత్వ అనుమతి కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. అదేవిధంగా సంగెం-యెఖీన్‌పూర్ గ్రామాల మధ్య నిర్మిస్తున్న చెక్ డ్యామ్, వంతెన కోసం రూ.4.10 కోట్లు మంజూరు కాగా చెక్ డ్యామ్ పనులు పూర్తయి వంతెన పనులు పిల్లర్ల దశలో నిలిచిపోయాయి. వాగు రెండువైపులా కోతకు గురికావడంతో గతంలో నిర్మించిన ఓ పిల్లర్ వాగు ఉధృతికి వంగిపోయింది. దీంతో అదనంగా రూ.1.30లక్షలకు ప్రతిపాదనలు పంపించారు. మంజూరు కాగానే పనులు మొదలు పెడతామని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రయాణికులకు తప్పని తిప్పలు..

వంతెన నిర్మాణ పనుల్లో నెలకొన్న జాప్యంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. భారీ వర్షాల కారణంగా పెద్దవాగు ఎన్నడూ లేనివిధంగా ఉప్పొంగడంతో వాగులో నిర్మించిన తాత్కాలిక దారులు కూడా తెగిపోయాయి. దీంతో మూడునెలలు గ్రామాల మధ్య సుమారు 9 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వచ్చింది. రైతులతో పాటు ప్రతి నిత్యం పాలు, కూరగాయల వ్యాపారులు కోరుట్ల పట్టణానికి వెళ్లేందుకు, ఇతర పనుల కోసం వెళ్లే వాళ్లకు ఇబ్బందులు తప్పడం లేదు.

కోతకు గురైన పట్టా భూములు..

సంగెం-యెఖీన్‌పూర్ గ్రామాల మధ్య నిర్మిస్తున్న చెక్‌డ్యామ్, వంతెన పనుల్లో జాప్యంతో వంతెన వద్ద వాగుపక్కన ఉన్న రైతులకు చెందిన పట్టా భూములు రెండువైపులా సుమారు 3ఎకరాల పట్టా భూములు కోతకు గురయ్యాయి. ఓ వైపు వరిపొలం కొట్టుకుపోగా మరో వైపు మామిడి తోట కోతకు గురైంది. చెక్ డ్యామ్ నిర్మాణంతో తమ భూములు కోతకు గురయ్యాయని ప్రభుత్వం పరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు. వంతెన పనులు పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

9కిలోమీటర్లు తిరిగి వెళ్లాం



వాగులో దారికోతకు గురికావడంతో వర్షాకాలం బాగా ఇబ్బంది పడ్డాం. అప్పుడైతే 9కిలోమీటర్లు తిరిగి వెళ్లాం. ఇప్పుడు పొలం కోతల కోసం హార్వెస్టర్లకు, వడ్ల రవాణాకు ఇబ్బందులు పడాల్సిందే. త్వరగా బ్రిడ్జి పూర్తి చేసి అన్ని వాహనాలు నడిచేలా చర్యలు తీసుకోవాలి.

– మతీన్, రైతు, కోరుట్ల

వంతెన పూర్తి చేయాలి



కోరుట్లలో కూరగాయలు అమ్మేందుకు సంగెం నుంచి రోజూ వెళ్తాం. వాగులో దారి కోతకు గురికావడంతో వర్షాకాలం కోరుట్లకు 9 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం వాగు ఇసుకలో నుంచే వెళ్తున్నప్పటికీ మళ్లీ వర్షాలు పడితే ఇబ్బందే. వంతెన త్వరగా పూర్తి చేయాలి.

– గోపిడి రాములు, సంగెం

ప్రతిపాదనలు పంపాం



సంగెం-యెఖీన్‌పూర్ మధ్య వంతెన పనులు వచ్చే నెలలో ప్రారంభిస్తాం. సైడ్ వాల్స్ కోసం రూ.1.30కోట్ల ప్రతిపాదనలు పంపాం. కోరుట్ల-సంగెం మధ్య పనుల కోసం అదనపు నిధులు అవసరం ఉంది. మంజూరు కాగానే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాం.

– ఆదిత్య, ఏఈ, పంచాయతీరాజ్

నెరవేరనున్న దశాబ్దాల కల

- సోమేశ్వర కొండ ఘాట్‌రోడ్డు నిర్మాణానికి రూ.25కోట్లతో ప్రతిపాదనలు
- మొదటిదశలో రూ.10కోట్లు మంజూరు



శ్రీకనకసోమేశ్వర స్వామి ఆలయం (ఫైల్)

మల్లాపూర్: మండల కేంద్రంలోని సోమేశ్వర కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మించాలన్న కల నేరవేరనుంది. రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్, ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఘాట్‌రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మొదట రూ.10లక్షలు మంజూరు చేయించి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి కొండపై సర్వే చేయించారు. మండల ప్రజలకు, భక్తులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ రూ.25కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా మొదటిదశలో కొండపైకి మట్టిరోడ్డు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ నిధులు రూ.10కోట్ల నిధులు మంజూరు చేయించారు. రెండురోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తికానుందని, త్వరలోనే రోడ్డుభవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రెండో విడతలో రూ.15కోట్ల నిధులను మంజూరు చేయించి బీటీరోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు సమాచారం.

మన 'ఊరు-మన బడి' పనులు వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న డీఈ, ఏఈ, ఎంఈవో

కథలాపూర్: మండలంలో 'మన ఊరు-మన బడి' పనులు వేగవంతం చేయాలని వేములవాడ డివిజన్ డీఈ శ్రీనివాస్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని భూషణరావుపేట, సిరికొండ గ్రామాల్లో 'మన ఊరు-మన బడి' పనులను పరిశీలించారు. ఈ నెల 1న ప్రారంభోత్సవాలు చేయాల్సి ఉండగా.. పనుల్లో జాప్యం జరుగుతున్న తీరుపై కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మరమ్మతు పనులు నాణ్యతగా ఉండాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఎంఈవో ఆనందరావు, ఏఈ శ్రీధర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్షద్, హెచ్‌ఎం చొడారపు విష్ణు, కూన శ్రీనివాస్ ఉన్నారు.

అగ్గితెగులు సోకిన పొలాల పరిశీలన



రాయికల్: పరిశీలిస్తున్న ఏవో ముక్తేశ్వర్

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాలరూరల్ మండలంలోని లక్ష్మీపూర్, నర్సింగాపూర్, జాబితాపూర్ తదితర గ్రామాల్లో రైతులు సాగుచేసిన వరి పంటకు అగ్గి తెగులు సోకగా, బుధవారం వ్యవసాయాధికారి ఏఈవో హరీశ్ సందర్శించారు.

నివారణ చర్యలు చేపట్టాలి

మల్యాల: అగ్గితెగులు నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు కారుణ్యకుమార్, మంజుల సూచించారు. ముత్యంపేటలోని వరిక్షేత్రాలను సందర్శించారు.

మైతాపూర్‌లో వరిపంటల పరిశీలన

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామంలో వరిపంట పొలాలను మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ బుధవారం పరిశీలించారు. ఏఈవో మతాయి, రైతులు రఘుపతి, గన్నె జగతి, కోల మల్లయ్య పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని చింతకుంట, భూషణరావుపేట, గంభీర్‌పూర్ గ్రామాల్లో వరి పొలాలను ఏవో యోగితా బుధవారం పరిశీలించారు. వరిపంటలో అగ్గి తెగుళ్లతో ఎదుగుదల లోపించిందని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఏఈవో ఎం.డీ ఫమీనా, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, రైతుబంధు సమితి అధ్యక్షుడు బద్దం మహేందర్‌రెడ్డి ఉన్నారు.

కేంద్ర పథకాలను ఇంటింటా వివరించాలి

జగిత్యాలరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇంటింటా వివరించాలని బీజేపీ నియోజకవర్గ నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి సూచించారు. ఈ మేరకు బుధవారం బీఎల్‌ఎస్ గార్డెన్స్‌లో బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 10 నుంచి జరిగే శక్తి కేంద్రం కార్నర్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ చిలుకమర్రి మదన్‌మోహన్, పట్టణ అధ్యక్షుడు అనిల్, నాయకులు శైలేందర్‌రెడ్డి, సత్యనారాయణ, సిరికొండ రాజన్న పాల్గొన్నారు.

పరామర్శ

జగిత్యాలరూరల్: మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గడ్డం జలపతిరెడ్డి నాలుగు రోజుల క్రితం ఇద్దరు కుమార్తెలతో సహా ఆత్మహత్య చేసుకోగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్ బుధవారం జలపతిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధ్యులపై చర్యలు తీసుకునేలా చూడాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఎస్పీ నాయకులు నక్క విజయ్‌కుమార్, మద్దెల నారాయణ, సంపత్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ మల్టీపర్పస్ వర్కర్లు శుభ్రత పాటించాలి

కథలాపూర్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు పరిశుభ్రత పాటించాల్సిందేనని మండల పంచాయతీ అధికారి గంగాధర్ సూచించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని చింతకుంట, భూషణరావుపేట గ్రామాల్లో పర్యటించారు. చింతకుంటలో ఉపాధిహామీ పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. మల్టీపర్పస్ వర్కర్లు తప్పనిసరిగా యూనిఫాం, గ్లౌజులు, శానిటేషన్ కిట్లు వాడాలని ఆదేశించారు. ఆయన వెంట కార్యదర్శులు మోహన్, ఎం.డీ గఫూర్ ఉన్నారు.

✦ చిన్నారులకు అన్నప్రాసన

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-5లో బుధవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పోషకాహారం పంపిణీ చేశారు.

✦ డప్పులు అందజేత

కోరుట్లరూరల్: మండలంలోని సంగెం గ్రామంలో డప్పు కళాకారులకు సర్పంచ్ చెప్పాల నర్సయ్య తన సొంత ఖర్చులతో బుధవారం డప్పులు అందజేశారు. కాళ్లకు గజ్జెలు అందజేశారు.

✦ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ధర్మపురి: మండలంలోని నక్కలపేటలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ధర్మపురి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 250 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ మొగిలి శేఖర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఇందారపు రామకృష్ణ, జక్కు రవీందర్, పైడి మారుతి, రవీందర్ ఉన్నారు.

✦ మహా పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

సారంగాపూర్: గ్రామపంచాయతీల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది తమ డిమాండ్ల పరిష్కారానికి చేపేడుతున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్‌ను బుధవారం బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

✦ వృద్ధాశ్రమం సందర్శన

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలోని నివేదిత వృద్ధాశ్రమాన్ని బుధవారం ఇటిక్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు సందర్శించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు మహేశ్వరశర్మ, నాగరాజు, సంపత్ పాల్గొన్నారు.

✦ 11న మెగా లోక్ అదాలత్

కథలాపూర్: ఈనెల 11న కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల కోర్టులో మెగా లోక్ అదాలత్ కార్యక్రమం ఉంటుందని కథలాపూర్ ఎస్సై రాంచంద్రం తెలిపారు. ఇరువర్గాలు రాజీ కుదుర్చుకునే కేసులకు అవకాశం ఉందన్నారు. వివిధ కేసులు ఉన్నవారు రాజీమార్గం వినయోగించుకోవాలని కోరారు.

దివ్యాంగులకు స్కూటీ లైసెన్స్ ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

జగిత్యాలరూరల్: జిల్లాలోని దివ్యాంగులకు స్కూటీ వాహనాల లైసెన్స్ ఇవ్వాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు జగిత్యాలరూరల్ మండలం తాటిపల్లి గ్రామ శివారులో జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వంశీధర్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. జిల్లాలోని దివ్యాంగులు తమ రెట్రోఫిటెడ్ (స్కూటీ వాహనాల లైసెన్స్) ఇవ్వాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు దివ్యాంగులు పేర్కొన్నారు. జిల్లా దివ్యాంగ నాయకులు లంకదాసరి శ్రీనివాస్, అస్గర్, మహ్మద్‌ఖాన్, గొల్లపల్లి శ్రీధర్, ధనలక్ష్మి, రాకేశ్ పాల్గొన్నారు.



జాతర ఉత్సవాలలో మహా అన్నదానం

మల్లిఖార్జునస్వామి జాతర మహోత్సవాలు



అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని రత్నాపూర్‌లో శ్రీ మల్లిఖార్జునస్వామి జాతర మహోత్సవాలు ఐదోరోజు ఘనంగా నిర్వహించారు. బుధవారం వేకువజామున 2 గంటలకు ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో భక్తులు నడిచి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహోత్సవాల్లో సర్పంచ్ మేడి అనూష, ఎంపీటీసీ దేవ ముత్తమ్మ, ఉపసర్పంచ్ గోల్కొండ లయ, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, ప్యాక్స్ వైస్‌చైర్మన్ గొండ రాజేందర్, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, ఆలయ కమిటీ చైర్మన్ దేవ రాజలింగం, నాయకులు మేడి వినోద్, నల్ల గంగమల్లయ్య, సుద్దపెల్లి లింగమూర్తి, గోల్కొండ అనిల్, టీసీ రాజన్న పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఉచిత నైపుణ్య శిక్షణ



మాట్లాడుతున్న ఉన్నతి నోడల్ ఆఫీసర్ నరేశ్

జగిత్యాలజోన్: ఉపాధి కూలీలకు ఉన్నతి కార్యక్రమం కింద ఉచితంగా ఇచ్చే నైపుణ్య శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని ఉన్నతి నోడల్ ఆఫీసర్ పి.నరేశ్ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో 348 మంది ఉపాధి కూలీలకు డీఆర్‌డీఏ, రామగిరి ఖిలా క్రిషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజులు కూలీ పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీలకు నైపుణ్య శిక్షణను అందిస్తున్నామని చెప్పారు. ఈ శిక్షణలో వర్మి కంపోస్టు తయారీ, నర్సరీ కూరగాయల పెంపకం, నూనె గింజలు యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీనారాయణ, అడిషనల్ డీఆర్‌డీఏ సుధీర్‌కుమార్, జేడీఎం వెంకటేశ్వర్లు, క్రిషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీనివాస్, వెంకన్న, భాస్కర్, వినోద్, కిరణ్, నవ్య పాల్గొన్నారు.

పగటివేళల్లో వ్యవసాయానికి విద్యుత్ ఇవ్వాలి



మాట్లాడుతున్న కృష్ణారావు

కోరుట్ల: వ్యవసాయానికి పగటి వేళల్లోనే 12 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని టీపీసీసీ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈ మేరకు బుధవారం కోరుట్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇతర రాష్ట్రాలకు వెళ్లి తెలంగాణాలో నిరంతర విద్యుత్ ఇస్తున్నామని ఉపన్యాసాలు ఇస్తూ ఇక్కడ రెండు, మూడు గంటలు కూడా వ్యవసాయానికి సరిగా కరెంటు ఇవ్వడం లేదని ఆరోపించారు. రాత్రివేళల్లో త్రీఫేజ్ ఇవ్వడంతో రైతులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయని, పగటి వేళల్లో వ్యవసాయానికి విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల ఐక్యత కోసం ఆత్మగౌరవ సభ



మాట్లాడుతున్న లక్ష్మీనర్సయ్య

మెట్‌పల్లి: పద్మశాలీలను ఐక్యం చేయడం కోసం తొందరలోనే ఆత్మగౌరవ సభను నిర్వహించాలని సంఘం నాయకులు నిర్ణయించారు. పట్టణంలోని సంఘ భవనంలో బుధవారం 10 జిల్లాలకు చెందిన సంఘ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పద్మశాలీలు ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని, దీనికోసం తొందరలోనే 2లక్షల మంది కుటుంబ సభ్యులతో ఆత్మగౌరవ సభను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. కాగా సభకు చైర్మన్‌గా బస్వా లక్ష్మీనర్సయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలి

మల్లాపూర్: ప్రభుత్వ భూముల్లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని రేగుంట ఆల్‌యూత్ అసోసియేషన్ అండ్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గనవేని మల్లేశ్ కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని రేగుంట గ్రామపంచాయతీలో యూత్ సభ్యులు, వీడీసీ సభ్యులతో కలిసి సర్పంచ్ నర్సయ్య, కార్యదర్శి విజయ్‌కు ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేగుంట గ్రామ శివారులోని 286/2 సర్వేనంబర్లలో గల ప్రభుత్వానికి సంబంధించి 15 గుంటల భూమి ఉందన్నారు. కొంతమంది గ్రామస్తులతో కుమ్మక్కై ప్రభుత్వ భూములను కబ్జా చేసి ప్లాట్లుగా చేసి అమ్ముతున్నారని, అక్రమ నిర్మాణాలను నిర్మించుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. వీడీసీ సభ్యులు నల్ల రాజేశం, శేఖర్, ఏఆర్ రెడ్డి, జలందర్, ఆల్‌యూత్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బందెల నరేశ్, కోశాధికారి వేములవాడ దేవరాజం, సభ్యులు బొల్లారపు వినోద్, మోతె రమేశ్, కుందేల్ల రాజేశ్, భైర రవి, రాజు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి



పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రమేశ్

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి మిట్టపల్లి రమేశ్ కోరారు. ఈ మేరకు బుధవారం జగిత్యాలరూరల్ మండలం పొరండ్లలోని కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. సర్పంచ్ పొగ్గుల సంధ్యారాణి, సెక్రటరీ కిరీటి, కారోబార్ దుంపల రాజిరెడ్డి, ఏఎన్‌ఎంలు వరలక్ష్మి, విజయలక్ష్మి, ఆశావర్కర్లు లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని డబ్బుతిమ్మయ్యపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ డబ్బు రాధ గౌతమ్‌రెడ్డి ప్రారంభించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, డాక్టర్ పరమేశ్వరి, క్యాంప్ ఆఫీసర్ హారిక, సీహెచ్‌వో రాజశేఖర్, ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి, వార్డు సభ్యులు ఎండీ.అక్బర్, గాజుల రాజవ్వదేవయ్య, పంచాయతీ కార్యదర్శి అరవింద్ నాయక్ పాల్గొన్నారు.

మల్లాపూర్ మండలంలో..

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లి, సాతారం గ్రామాల్లో కంటివెలుగు కొనసాగుతోంది.